క్లుప్తంగా

నేటి నుంచి రెండుపూటలా తరగతులు

వీరఘట్టం: ఇంతవరకు ఒక్కపూట నిర్వహిస్తున్న తరగతులను సోమవారం నుంచి రెండు పూటలా నిర్వహించనున్నట్లు వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీజీవీఎస్ త్రినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కళాశాల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 3 పీరియడ్స్ తర్వాత మధ్యాహ్నం 12.50 గంటల నుంచి 1.40 వరకు భోజన విరామం ఉంటుందన్నారు. తర్వాత 3 పీరియడ్స్ ఉంటాయని.. అనంతరం సాయంత్రం 4.10 గంటల నుంచి 5 గంటల వరకు ప్రతిరోజూ స్టడీ అవర్ ఉంటుందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం లంచ్ బాక్స్‌లు తెచ్చుకోవాలని సూచించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కోటదుర్గాదేవి

వీరఘట్టం: మండల కేంద్రంలోని కోటదుర్గ అమ్మవారికి కార్తీక అమావాస్య కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి



హామీలు అమలు చేయాలంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వ నాయకులు వెంటనే అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడుతూ, ఎన్నికల హామీలు అమలు చేయటంలో అలసత్వం వహించం సరికాదన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన నాయకులు..నేడు ప్రజలకు చార్జీల భారం ఎలా వేస్తారని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు చేపల కిశోర్, జి.మోహన్, పి.హరికృష్ణ తదితరులున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడదల చేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: ఈ నెల 10,11 తేదీల్లో కురుపాం మండల కేంద్రంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కొమరాడలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీపీఎం ప్రతి నిత్యం పోరాడుతోందన్నారు. కొమరాడ మండలంలో ఏనుగుల సమస్య, జంఝావతి రిజర్వాయర్, పూర్ణపాడు–లాబేసు వంతెన, కోటిపాం పవర్ ప్లాంట్, గుమ్మడిగెడ్డ, రోడ్లు, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తదితర సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం చేస్తున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వారాంతపు పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సీతానగరం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని గాదెలవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం శంకరరావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వారాంతపు పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 242 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిలో 8 మంది వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఒక గంట సమయం పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు.

చీడపీడల ధాటికి..

వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం



పంట కోసిన తర్వాత నేలరాలిన వరి గింజలను చూపిస్తున్న రైతులు

- చివరి దశలో ఆశించిన నల్లకంకి, రెల్లురాల్చు పురుగు
- గింజలు రాలిపోవడంతో తగ్గిన దిగుబడి
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

వీరఘట్టం:

వరి పంట కోతకు సిద్ధంగా ఉందన్న దశలో చీడపీడల ఉధృతితో తీవ్ర నష్టం తప్పడం లేదు. ముఖ్యంగా నల్లకంకి, రెల్లురాల్చు పురుగు సోకడంతో మండలంలోని నడుకూరు, సంత–నర్సిపురం గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం ఏర్పడింది. ముఖ్యంగా ఎంటీయూ 1318 రకం పంటకు ఎక్కువగా చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. పంటను కోసే సరికి గింజలు నేలపై రాలిపోతుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా చేతికి వచ్చిన పంట చేలోనే మట్టిలో కలిసిపోతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది 30 బస్తాల దిగుబడి వస్తే ఈ ఏడాది కనీసం 15 బస్తాల దిగుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. ఇంతలో తుఫాన్ ప్రభావంతో పొలంలోనే వరి గింజలు రాలిపోయి ఒట్టి గడ్డి మాత్రమే మిగిలిందని అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించి పరిహారం వచ్చేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గింజలు రాలిపోతున్నాయి..

ఈ ఏడాది మూడు ఎకరాల్లో 1318 రకం వరి పంట వేశాను. రెండు రోజుల కిందట చేను కోయించాను. నల్లకంకి, రెల్లరాల్చు పురుగుల వల్ల పంట కోస్తున్నప్పుడే గింజలు రాలిపోయాయి. కోసిన చేనును ఆరబెట్టగా గింజలు మొత్తం రాలిపోయి గడ్డి మాత్రమే మిగిలింది. వ్యవసాయశాఖ అధికారులు కోసిన పంటను పరిశీలించి నష్టం పరిహారం వచ్చేలా చూడాలి.

– కర్రి లీలాప్రసాదరావు, రైతు, నడుకూరు, వీరఘట్టం మండలం

పంట నేలమట్టం

ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో వరి పంట వేశాను. బాగా పండింది. అయితే కోత కోసేసరికి గింజలు నేలరాలిపోతున్నాయి. చేతికొచ్చిన పంట నేలమట్టమవుతుండడంతో ఏం చేయాలో తెలియడం లేదు. వరిదుబ్బు అడుగున రెల్లురాల్చు పురుగులున్నాయి. వీటి వల్ల గింజలు రాలిపోతున్నాయి. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లెంక జగదీశ్వరరావు, రైతు, నడుకూరు, వీరఘట్టం మండలం

మాట ఇవ్వడం మడమ తిప్పడం బాబు నైజం

- ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- ఆరు నెలల్లో రెండుసార్లు పెంచిన విద్యుత్ చార్జీలు
- ప్రజలపై రూ.15,485 కోట్లు భారం
- ప్రభుత్వంపై మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మాట ఇవ్వడం మడమ తిప్పడం చంద్రబాబు నైజమని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్‌గా చరిత్రలో నిలిచిపోతారని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ధ్వజమెత్తారు. చినమేరంగిలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. నాటి బాబు ష్యూరిటీలు నేడు బాదుడు గ్యారంటీగా మారాయన్నారు. 2023లో పులివెందుల ఎన్నికల ప్రచారసభలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచడం అంటూ ఉండదని ప్రజలకు హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు దఫాలు విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు భారం మోపారని మండిపడ్డారు. జనవరి నెల నుంచి యూనిట్‌కి రూ.2.19 అదనంగా పడుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అమ్మకు వందనం పథకం జాడలేదని, మహిళలకు ఫ్రీబస్సు హామీని విస్మరించిందని, యాభై ఏళ్లు దాటిన వారికి పింఛన్ల మంజూరు ఊసే లేదన్నారు. ఎన్నికల హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ గొర్లి సుజాత, వట్టిగెడ్డ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బలగ వెంకటరమణ ఉన్నారు.

ఇదీ బాబు మార్కు రాజకీయం..

- ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ
- అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడు..
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజం



మాట్లాడుతున్న విక్రాంత్

పాలకొండ: సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు తన అసలు రంగు మరోసారి చూపిస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. ఆదివారం నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో కలసి అతని స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, ట్రూఅప్ చార్జీలు ఎత్తివేస్తామని పలుమార్లు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు.. ఇప్పుడు తాను ఏ హామీ ఇవ్వలేదని నిస్సిగ్గుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోనికి రాగానే ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని మండిపడ్డారు. ఇందన సర్దుబాటు చార్జీల కింద ప్రభుత్వం ఇప్పటికే ప్రజల నుంచి రూ. 9412.50 కోట్లు వసూలు చేసిందని తెలిపారు. అలాగే గడిచిన ఆరు నెలల్లో రూ.15485.36 కోట్లు ప్రజలపై భారం వేసిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలపై అదేపనిగా విరుచుకుపడి ఎల్లో మీడియా చంద్రబాబు హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టినా, ఎటువంటి వార్తలు రాయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్కూల్ ఫీజులు, కాలేజీ ఫీజులు, పాలు, కూరగాయలు, బియ్యం, పప్పుదినుసుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆయనతో పాటు నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రతలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ అన్నారు. గడిచిన మూడు రోజులుగా తమ సిబ్బందితో కలసి సాధారణ విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. వినియోగదారుల భద్రత మేరకు క్షేత్రస్థాయిలో తమ సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు చోట్ల మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలంలో గల విద్యుత్ మోటార్లు, పరికరాల వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్వీసు విద్యుత్ తీగలు తెగిపడినా, జాయింట్ చేసి ఉన్నా అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే వాటర్ మోటార్లు, మిక్సీలు, గ్రైండర్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా 1612 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పాలకొండలో వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. పట్టణ అంతర్గత రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో శివారు ప్రాంతాల్లో బురద పేరుకుపోయింది. నగర పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుంటే సీజనల్ జ్వరాలు, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత గజగజ



- పంటలు ధ్వంసం చేస్తున్న గజరాజుల గుంపు
- అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొమరాడ:

మండలంలోని రైతులకు గజరాజుల గుంపు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల కందివలస, కుమ్మరిగుంట, గంగారేగువలస, స్వామినాయుడువలస గ్రామ పరిసరాల్లో ఏనుగులు గుంపుగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఎప్పుడు ఏ గ్రామంలోకి చొచ్చుకొస్తాయో? ఎవరి పంటలు ధ్వంసం చేస్తాయో అని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జంఝావతి డ్యాం గట్టు దాటి రిజర్వాయర్ లోనికి వెళ్లిన గజరాజులు మళ్లీ శనివారం అర్ధరాత్రి కందివలస గ్రామ పరిసరాల్లో టమోటా, పామాయిల్ తోటల్లో సంచరించాయి. పంటలను ధ్వంసం చేశాయి. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో ఇలా ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ధర ఉన్నా లాభం లేదు

మండలంలో రైతులు ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ ఏడాది టమోటాకు రేటు భారీగా పెరగడంతో తమకు కలిసివస్తుందని భావించి అప్పులు చేసి మరీ టమోటా పంట సాగుచేశారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందనే లోగా ఏనుగులు పంటను ధ్వంసం చేశాయని, పొలంలో అమర్చిన డ్రిప్ పైపులు, మోటార్లును కూడా పాడుచేశాయని బాధిత రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.



పామాయిల్ తోటలో ఏనుగులు గుంపు ధ్వంసం చేసిన మోటర్ పంపు డ్రిప్(ఫైల్)



కందివలస వద్ద ఏనుగులు పాడుచేసిన టమోటా పంటను చూపుతున్న రైతులు

ఏనుగులను తరలించిండి

ఆంధ్రా ఒడిశా సరిహద్దులో ఉన్న జంఝావతి రిజర్వాయర్ ప్రాంతంలో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంది. ఓ వైపు అటవీ ప్రాంతం. మరోవైపు జంఝావతి నది ప్రవాహం ఉండటంతో గజరాజులు ఉండేందుకు అనువుగా ఉంది. అయితే గ్రామాల్లోకి చొరబడి పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గజరాజుల గుంపు గ్రామాల్లోకి రాకుండా, పంటలను నాశనం చేయకుండా అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఏనుగుల సంచారాన్ని గమనించేందుకు ఫారెస్ట్ అధికారులకు ట్రాకర్లను ఏర్పాటు చేశారు. వాటిని ఇక్కడ నుంచి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు

పారదర్శకంగా నీటి సంఘ ఎన్నికలు



నీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులపై ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమై ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. ఈ తరుణంలో కూటమి నాయకుల ఆగడాలను అడ్డుకోవాలని తెలిపారు. అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. – పాలకొండ

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ..



సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్లను పాలకొండ పట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. ఈ నెల 10, 11 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు కురుపాంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చించి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. సభలకు అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ. లక్ష్మణరావు, కాద రాము, దూసి దుర్గారావు, ఎ. భానుచందర్, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ

అవగాహన ర్యాలీ..



హెచ్‌ఐవీపై అవగాహన తప్పనిసరని ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ నాగభూషణరావు అన్నారు. ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల కఠినంగా ఉండకూడదని తెలిపారు. వారికి సామాజిక మద్దతు అందించాలని సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ చిరంజీవి, నర్సింగ్ సూపరింటిండెంట్ షోపియా, ఐసీటీసీ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు. – పాలకొండ

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల జయమణి



పట్టణంలో అవగాహన ర్యాలీ చేపడుతున్న డిగ్రీ కళాశాల, అధ్యాపకులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: హెచ్‌ఐవీ రహిత సమాజస్థాపనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ చైతన్యవంతులై మెలగాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలసి పట్టణంలో అదివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. హెచ్‌ఐవీ మహమ్మారికి దూరంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో వ్యాధికి గల కారణాలు, అధిగమించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వ్యవహరించాల్సిన తీరును వివరించే కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యం.శాంతి, కె.శ్రీనివాసరావు, తిరుపతిరావు, ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 వలంటీర్లు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి..

- ఏఓ వాహిని



వీరఘట్టం రహదారిలో లోతట్టు భూముల్లో చేరిన వర్షపునీరు

పాలకొండ రూరల్: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా తడిచిన వరి పంటను రక్షించుకోవడానికి అధికారుల సూచనలు పాటించాలని ఏఓ ఎన్ని వాహిని అన్నారు. వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. ఆదివారం కూడా ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో లోతట్టు వరి చేళ్లలోకి నీరు చేరింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయి వ్యవసాయ సహాయకులతో కలసి ఏఓ వాహిని మండలంలో పర్యటించారు. ముఖ్యంగా లుంబూరు, బుక్కూరు, మంగళాపురం, సింగుపురం, మల్లివీడు, తంపటాపల్లి, తుమరాడ, తదితర ప్రాంతాలపై దృష్టి సారించారు. వర్ష ప్రభావంతో తడిచిన చేలను, దిగుబడిని రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు చేశారు. గింజ మొలకెత్తకుండా లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. పూర్తిగా ఆరని పనలను కుప్పగా వేయాలనుకుంటే 25 కిలోల ఉప్పును (ఎకరాకు) పనలపై పైపాటుగా చల్లాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న చేను పడిపోతే పొలంలో నీటి నిల్వలు లేకుండా కాలి బాటలు తీసుకోవాలన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

సీతంపేట: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బిడ్డిక గణేష్, ఎస్.మోహనరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.